**న్యూజెర్సీ కథల పోటీల్లో ఉత్తమంగా ఎంపికై రూ. 1000 గెల్చుకున్న కథ**

# సహచర్యం

కళ్ళకింద కదులుతున్న నందనవనంలోకి ఒక్కసారిగా వేడి గాలి ప్రవేశించింది. మెత్తని, నులివెచ్చని కాంతి ఒక్కసారిగా తీవ్రరూపం దాల్చి, ప్రజ్వరిల్లి, బీటలువారి, చిట్లిపోయి, తునాతునకలైపోయింది. పుష్పాలు, లతలు వడిలి. మాడి, రాలిపోతున్నాయి. కుడి కంటిమీద చుర్రుమనే బాధతో, మండుతున్న కళ్లను నెమ్మదిగా తెరిచాడు రామనాథం. రెప్పకింద మెత్తటి చర్మానికి అతుక్కుపోయి ఆనందంగా రక్తాన్ని పీల్చేస్తున్న దోమని వేళ్ళమధ్య కసిగా నలిపేసి, కళ్ళు నులుముకుని, చుట్టూ చూశాడు. ఇంట్లో కరెంట్ పోయినట్టుంది. అంతా చీకటి. వీధి దీపం ఒకటి మాత్రం కిటికీలోంచి కాస్త కాంతిని పడేస్తోంది. గాలి లేదు. ఒకటే ఉక్క. మడత మంచం కుయ్యోమంటోంది. వీపుకింద మంచం గుడ్డకి గుండ్రంగా అయిన చిల్లులోంచి మాత్రం చల్లగా గాలి తగుల్తోంది.

చాలాసేపు అలా చీకట్లోకి చూస్తూ వుండిపోయాడు రామనాథం. ముసలాడైనా కళ్ళు తొందరగానే అలవాటు పడుతున్నాయి చీకటికి. రెండు నిమిషాల తర్వాత పక్కకి ఒత్తిగిలి భార్యకోసం చూశాడు. పక్కనే చాపమీద పడుకునుంది వరలక్ష్మి. 'పాపం.. గొడ్డు చాకిరీ చేస్తుంది. పొద్దున్నే కాఫీ టిఫినూ, మధ్యాహ్నానికి వంటా, మళ్ళీ మూడింటికి టీ, వెంటనే సాయంత్రానికి వంటా.. పిచ్చిముండ' అనుకున్నాడు రామనాథం.

వరలక్ష్మి ఒళ్ళు మరచి నిద్రపోతోంది, ఉక్కపోస్తున్నా కూడా. మసక వెలుతురులో వరలక్ష్మి మొహాన్ని అలా చూస్తూ వుండిపోయాడు రామనాథం. అరవైయ్యేళ్ళొచ్చినా ఆమె ముఖంలో అందం తరిగిపోలేదు. సూదైన ముక్కు. ముక్కు కొనన చిన్నప్పటినుంచీ వున్న ఆ అందమైన ఎరుపు. ఆ ఎరుపుకి దీటుగా మెరిసే పగడపు ముక్కుపుడక. తెల్లటి కేశ సంపద దిండుమీద సాయంకాలపు ఆకాశంలాగా పరుచుకుని వుంది. అప్పటికంటే, వయసుతో వచ్చిన చిన్న ముద్దైన పొట్ట.

పెళ్ళయ్యేనాటికి వరలక్ష్మికి పద్నాలుగేళ్ళు. తనకి ఇరవైరెండేళ్ళు. అప్పటికే ఆలస్యం చేశారనుకున్నారు వరలక్ష్మి బంధువులు. 'ఎంత బావుండేదో అప్పుడు' అనుకున్నాడు రామనాథం తిరిగి వెల్లకిలా పడుకుంటూ. ఇప్పుడు కళ్ళు చీకటికి ఇంకాస్త అలవాటుపడ్డాయి. అయినా వాటి అవసరం పెద్దగా లేకుండా మనసు గతంలోకి పరుగులెట్టింది. 'రకరకాల ఘట్టాలుంటాయి కదా జీవితంలో' బెంగగా అనుకున్నాడు రామనాథం.

కాపురం ప్రారంభించిన కొత్తల్లో రోజుకో వంద సార్లైనా ముచ్చటపడేవాడు భార్య అందం చూసి. ధగధగలాడిపోయేది వరలక్ష్మి. శరీరం పరిపక్వతకి చేరకపోయినా ఆమె ముఖవర్చస్సు అనన్యసామాన్యంగా వుండేది. ఆ రోజులు గుర్తుకురాగానే రామనాథం శరీరంలో రక్తప్రసరణ హెచ్చింది. తిరిగి యౌవనవంతుడవుతున్న అనుభూతి కలిగింది. ఆమెతో తొలి శృంగారానుభవం ఆమెకి బాధ కలిగించినా తనకు మాత్రం మధురానుభూతిని మిగిల్చింది. ఆ తర్వాత మామూలే. ఒకర్నా ఇద్దరా, నలుగుర్ని కన్నది. మగపిల్లలు. పైకొచ్చారు. ఎక్కడెక్కడో ఉద్యోగాల్లో వున్నారు.

వేడి పెరిగి, ఉక్క పెరిగింది. లేచి కూర్చున్నాడు రామనాథం. మొర్రోమందా మంచం ఈసారి. నెమ్మదిగా లేచి వరలక్ష్మికి నిద్రాభంగం కలగకుండా అడుగులో అడుగు వేసుకుంటూ హాల్లోంచి వరండాలోకి నడిచాడు. చల్లని గాలి విసురుగా తాకింది. ప్రాణం లేచొచ్చింది. 'అబ్బా.. ఈ పని ఇందాకే చేసుంటే బావుండేది' అనుకున్నాడు. పడక్కుర్చీలో నడుం వాల్చాడు. ఎక్కణ్ణుంచో తియ్యని మట్టి వాసన. ఎక్కడో వర్షం దంచేస్తోంది. కొద్దిగా

— మోహనకృష్ణ

ఒళ్ళు విరుచుకుంటూ 'ఇలాంటప్పుడు వరలక్ష్మి ఓ కాఫీ కాచితే' అనుకున్నాడు.

పెళ్ళయినప్పటినుంచీ తనపట్ల ఎంతో గౌరవంగా ప్రవర్తించేది వరలక్ష్మి. కుండ పక్కనే మంచినీళ్ళడిగినా పరుగున వచ్చి ఇచ్చేది. ఆ కాలి అందెల చప్పుడు మనోహరంగా వుండేది. వంటింట్లో కూరలు తరుగుతున్నప్పుడు ముందు గదిలో చదువుకుంటున్న తనకు ఆమె చేతిగాజుల చప్పుడు తాళయుక్తంగా వినబడేది. కాఫీ, టీల ప్రవాహం అయితే అలా సాగుతూనే వుండేది. పిలిచేస్తే చాలు కాఫీ ప్రత్యక్షం. ఎంత మురుగ్గా చేసేదో! కుర్చీలో కూర్చుని చదువుకుంటుంటే ఇల్లు ఊడుస్తూ తన కాళ్ళ దగ్గరికి రాగానే ముందు ఒక కాలెత్తి తుడిచి, తరువాత రెండో కాలెత్తి తుడిచేది. చటుక్కున ముందుకి వంగి మెడమీద ముద్దుపెట్టుకునేవాడు. ఆశ్చర్యపోయి, అతని కళ్ళలోకి చూసి సిగ్గుపడి వెళ్ళిపోయేది. అప్పుడు తను కూడా చాలా సరదాగా వుండేవాడు.

రామనాథంకి వాళ్ళ నాన్న పెళ్ళిదుకొచ్చినప్పటినుంచీ చెప్పేవాడు. 'ఆడది ఎంతైనా ఆడది. మగాడు బాగా సంపాదించుకొస్తే మస్తీ చేసుకోవాలని చూస్తుంది. ఆడదానికి మగాడి డబ్బు మీదే మనసు. ఎప్పుడూ పెళ్ళానికి అలుసివ్వకు. ఎక్కడుంచాలో అక్కడుంచు' అని బోధించాడు. అయితే పాపం వరలక్ష్మి చాలా మంచిది. అది కారం చల్లాయించాల్సిన అవసరం, ఎప్పుడో గాని రాలేదు రామనాథానికి. ఒకసారి మాత్రం తను ఇంటికొచ్చేసరికి తాళం పెట్టి పక్కింటావిడతో కబుర్లాడ్డం చూసి పిచ్చి కోపం వచ్చి నానా తిట్లు తిట్టేశాడు. గజగజ వణికిపోయి బోరుమంది పాపం. కాసేపాగి శాంతించి బుజ్జగించాడు. 'ఇంటికొస్తే పెళ్ళాం కాఫీ ఇవ్వకపోతే ఒళ్ళు మండదటే లక్ష్మి నువ్వే చెప్పు' అని మందలించాడు. 'అదికాదండీ, ఆవిడకి జ్వరం. వాళ్ళాయనొచ్చేసరికి వంట లేకపోతే చంపేస్తాడని సాయం చెయ్యమంటేనూ..' అంది మెల్లిగా. 'అందుకని. మీ ఆయన్నొదిలేస్తావా' అన్నాడు చిలిపిగా. 'ఛీ' అని పారిపోయింది.

ఇంకోసారి తనతో చెప్పకుండా సినిమాకెళ్ళొచ్చింది. అప్పుడు మాత్రం ఉగ్ర నరసింహం అవతారమెత్తాడు. చావగొట్టేశాడు. 'ఏ మగ ముండాకొడుకైనా ఏమన్నా చేస్తే నేనెట్లా తలెత్తుకోగలను' అని చెంపలు వాయించేశాడు. ఆ రోజు గుర్తొస్తే ఇప్పుడు కూడా ఆవేశం వస్తుంది రామనాథానికి. పాపం ఎర్రగా కందిపోయాయి ఆరోజు వరలక్ష్మి చెంపలు. రాత్రంతా బయట పెద్ద వర్షం. ఇంట్లో వరలక్ష్మి ఏడుపు. ఆ రాత్రివేళ తనే జాలిపడి వెళ్ళి దగ్గరకు తీసుకుని ముద్దాడాడు. నెమ్మదిగా శృంగారంలోకి దించాడు.

ఈదురుగాలి హఠాత్తుగా పెరిగింది. వర్షం ఒక్కసారిగా దగులుకుంది. జల్లు వరండాలోకి చెళ్ళుమని కొట్టింది. రామనాథంకి కాఫీ కోరిక తీవ్రతరమైంది. అతనికి హఠాత్తుగా, మెరుపులా ఓ ఆలోచనొచ్చింది. ముచ్చటపడ్డారు. ఉత్సాహంగా లేచారు. నెమ్మదిగా హాల్లోకి వచ్చి సిమెంట్ అల్మారాలో కొవ్వొత్తి కోసం వెతికారు. దొరికింది. వెలిగించి, ఓసారి పడగ్గదిలోకి తొంగిచూశారు. నిద్రపోతోంది ఇంకా. 'భలే భలే' అనుకున్నారు సరదాగా. వంటింట్లోకెళ్ళి కొవ్వొత్తి జాగ్రత్తగా ఓ డబ్బామీద అతికించి పెట్టారు. బయట ఈదురు గాలి రామనాథం ఉత్సాహానికి వంతపాడుతోంది. స్టవ్ వెలిగించి నీళ్ళు పెట్టారు. గణగణమని మరిగేదాకా అక్కడే నుంచున్నారు. కాళ్ళు లాగాయి. కాసేపు అటూ ఇటూ నడిచారు. బాగా కాగగానే శుభ్రంగా రెండు స్పూన్లు కాఫీపొడి వేశారు. కక్కుర్తిపడేదని ఎప్పుడూ వరలక్ష్మిని కసిరేవారు కూడా. డికాక్షన్‌పై కొద్దిగా నీళ్ళు చిలకరించి, గిన్నెపై మూతపెట్టి ఇంకోసారి బెడ్‌రూమ్‌లోకి తొంగిచూసి, ఓ పది నిమిషాలు బోనులో పులిలా హాలంతా తిరిగారు. పదినిమిషాల తర్వాత మరగపొంగే వేడి కాఫీని రెండు కప్పుల్లో నింపారు. 'ఇంగ్లీషు వాళ్ళలాగా ఈ రోజు బెడ్ కాఫీ' అనుకున్నారు కొవ్వొత్తి పడగ్గదిలోకి తీసుకెళ్తూ. 'లక్ష్మీ' పిలిచారు కాస్త ముందుకి వంగి. 'ఏమే.. మొద్దు నిద్రా.. లే' ఎక్కడో పిడుగుపడి గుండె అదిరింది. 'ఒసేవ్.. లే.. బ్రహ్మాండమైన కాఫీ లేవా. వర్షం చూ..' ఆవిడ ముంజేతిని తాకగానే ఉలిక్కిపడ్డారు. చల్లగా.. మంచుముక్కలా వుంది. ఆగని పొత్తికడుపు భగ్గుమంది. మంట గుండెల్లోకి వ్యాపించి గొంతు ఎండిపోయింది. 'లక్ష్మీ' వెర్రిగా అన్నారు. ఓ పెద్ద మెరుపు మెరిసి వరలక్ష్మి ముఖం ఒక్కసారి వెలిగి ఆరిపోయింది.

